సాక్షి తూర్పుగోదావరి

శుక్రవారం । 9 । జూన్ । 2023



రూ.1,01,116 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి గురువారం తెలంగాణకు చెందిన కనుమూరి రఘురామ రాజు రూ.1,01,116 విరాళం అందజేశారు.



విఘ్నేశ్వరునికి రూ.1,11,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి అమెరికా వాస్తవ్యులు ప్రభల మాధవీకృష్ణరమేష్ గురువారం రూ.1,11,116 విరాళం ఇచ్చారు.

గరిష్టం/కనిష్టం
42.5° / 28.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.5	31.0
కాకినాడ	40.8	29.8
అమలాపురం	41.0	28.0

న్యూస్‌రీల్

బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) –టీకే ఏటీ ఇంటర్నేషనల్ – ఏపీఎన్ఆర్‌టీ సంయుక్త ఆధ్వర్యంలో బీఎస్సీ నర్సింగ్ చదువుకున్న అభ్యర్థులకు జర్మనీలో స్టాఫ్‌నర్సులుగా ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు తెలిపారు. 20 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వయసు, సాధారణ ఆసుపత్రులలో రెండేళ్ల అనుభవం, జర్మన్ భాష నేర్చుకోవడానికి ఆసక్తి ఉండాలన్నారు. తప్పనిసరిగా నర్సింగ్ గ్రాడ్యుయేట్ (బీఎస్సీ నర్సింగ్) అయి ఉండాలన్నారు. విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే బీ1 స్థాయి జర్మన్ భాష శిక్షణ కోసం నిర్బంధ ఉచిత ఆన్‌లైన్ తరగతులకు హాజరు కావాలన్నారు. బీ1 స్థాయి ఉత్తీర్ణత సాధించిన తర్వాత జర్మనీలో పనిచేయడానికి ఆఫర్ లెటర్ ఇస్తారన్నారు. రెజ్యూమ్‌తో పాటు ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, అనుభవ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి అన్నారు. జర్మనీలో విమాన చార్జీలతో పాటు ఉచిత ఆహారం, వసతి, మొదటి ఆరునెలల వరకూ ప్రారంభ స్థూల జీతం నెలకు 1,000 యూరోలు (రూ.89 వేలు) ఇస్తారన్నారు. ఆరు నెలల పాటు జర్మనీలో బీ2 సర్టిఫికేషన్ కోసం శిక్షణ ఇస్తారన్నారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే జీతం నెలకు దాదాపుగా 2,500 యూరోలు వరకూ పెరుగుతుందన్నారు. కేఎల్ విశ్వవిద్యాలయంలో శిక్షణాతరగతులు జూలై ఒకటవతేదీ నుంచి ప్రారంభమవుతాయని కొండలరావు తెలిపారు. www.apssdc.in/home/onlineProgramRegistrationలో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆసక్తిగల అభ్యర్థులు సర్టిఫికేట్ రెజ్యూమ్‌ని helpline@apssdc.in మెయిల్ ఐడి లేదా కాల్ సెంటర్: 99888 53335 నంబర్‌కు షేర్ చేయవచ్చని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండలరావు కోరారు.

హోంమంత్రి వనితను కలిసిన స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీ



హోంమంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనితను గురువారం రాత్రి స్కూలు ఎడ్యుకేషన్ రీజినల్ డైరెక్టర్ జి.నాగమణి మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణంలో క్యాంపు కార్యాలయంలో మంత్రికి పుష్ప గుచ్ఛం అందజేశారు. గతంలో ఎన్నాడు లేని విధంగా విద్యారంగంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకోచ్చారని ఈ సందర్భంగా ఆర్‌జేడీ అన్నారు.వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే రోజునే జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీకి అన్నీ సిద్ధం చేసినట్లు ఆర్‌జేడీ ప్రకటించారు. విద్యా రంగంలో తీసుకోచ్చిన సంస్కరణపై మంత్రితో కాసేపు చర్చించారు.

డెల్టాలకు 6,500 క్యూసెక్కులు

ధవళేశ్వరం: ఖరీఫ్ సాగుకు సంబంధించి కాటన్ బ్యారేజీ నుంచి గురువారం నీటి విడుదలను మరింత పెంచారు. తూర్పు డెల్టాకు 2,000, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది.

వడదెబ్బకు వ్యక్తి మృతి



సత్తిబాబు మృతదేహం

కొవ్వూరు: వేములూరులో దొరయ్యచెరువు కాలనీకి చెందిన కొల్లి సత్తిబాబు(45) గురువారం వడ దెబ్బకు గురై మృతి చెందినట్లు మృతుడి కుమారుడు శ్రీనివాస్ తెలిపారు. కూలి పనికి వెళ్లి మధ్యాహ్నం తిరిగి వస్తున్న సమయంలో మార్గమధ్యలో కుప్పకూలి పడిపోయి మృతి చెందినట్లు ఫిర్యాదులో శ్రీనివాస్ పేర్కొన్నాడని పట్టణ ఎస్సై భూషణం తెలిపారు. నందమూరు రోడ్డుమార్జిన్‌లో వేప చెట్టు నీడలో సేదతీరి అక్కడే పడి చనిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

పొల్యూషన్ బోర్డు రీజినల్ ఈఈగా సందీప్ రెడ్డి

కాకినాడ రూరల్: పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కాకినాడ రీజినల్ కార్యాలయ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరు(ఈఈ)గా ఎన్.సందీప్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని ఏపీ పీసీబీ హెడ్ ఆఫీసులో పనిచేసిన ఈయన పదోన్నతిపై కాకినాడ రీజినల్ కార్యాలయానికి వచ్చారు. ఇప్పటి వరకు ఈఈగా ఎస్.అశోక్ కుమార్ పనిచేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యావరణ పరిరక్షణ కోసం బాధ్యతయుతంగా పని చేస్తానన్నారు.

సర్కారు బడిబాట

- చర్యలు తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- విద్యాభివృద్ధికి అడుగులు
- ప్రభుత్వ స్కూళ్లలో అన్ని వసతులు
- అడ్మిషన్లకు పెరిగిన డిమాండ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విద్యాసంవత్సరం ప్రారంభానికి కొద్దిరోజులే ఉంది. అందరూ చదువుకోవాలి, ఏ చిన్నారీ స్కూలుకు వెళ్లకుండా ఉండకూడదు, పాఠశాలలు తెరిచే నాటికి పిల్లలందరూ బడిలోనే ఉండాలి అన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో విద్యాశాఖాధికారుల చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జిల్లాలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. బడికి వెళ్లకుండా ఇంటి వద్దే పనులు చేసుకుంటున్న ఆడపిల్లలు, తల్లిదండ్రులకు వృత్తుల్లో సాయంగా ఉంటున్న మగ పిల్లలను గుర్తిస్తున్నారు. పిల్లలను బడికి పంపించాలని, దాని వల్ల వచ్చే లాభాలను ఇంటి పెద్దలకు వివరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లో మొత్తం 105 మంది పిల్లలు మాత్రమే బడి బయట ఉన్నట్లు గుర్తించారు. వారందరినీ పాఠశాలలకు పంపేందుకు అన్ని చర్యలు పూర్తి చేశారు.

12 నుంచి పునఃప్రారంభం

జిల్లాలో పాఠశాలలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి విద్యాశాఖాధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. ప్రారంభం రోజు నుంచే సిలబస్ ప్రారంభమవుతుంది. ఉపాధ్యాయులు ఆ రోజు నుంచే పాఠాలు బోధించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలకు అందిస్తున్న సదుపాయాలు, సౌకర్యాలు కార్పొరేట్ స్కూళ్లకు మించి ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్చేందుకు తల్లిదండ్రులు క్యూ కడుతున్నారు. ఈసారి గతేడాది సీన్ రీపిట్ కానుంది. విద్యా సంవత్సరం ప్రారంభం అయిన కొద్ది రోజులకే జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల ముందు ప్రవేశాలు పూర్తయ్యాయి, ప్రవేశాలు లేవు, ప్రవేశాలు ఫుల్ అనే బోర్డులు దర్శనమిచ్చాయి. ఆ పాఠశాలల్లో ఏదో విధంగా తమ పిల్లలను చేర్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులతో రికమండేషన్లు చేయించుకున్న దాఖలెన్నో ఉన్నాయి.

హెచ్ఎంలదే బాధ్యత

ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులను హైస్కూళ్లలో ఆరో తరగతిలో చేర్చే పూర్తి బాధ్యత ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులదే. గతంలో ఐదో తరగతి చదువుకున్న పిల్లలను వారి తల్లిదండ్రులు తీసుకెళ్లి హైస్కూళ్లలో చేర్చేవారు. ఈ ఏడాది నుంచి ఆ విధానం మారింది. ఐదు పూర్తి చేసుకున్న విద్యార్థి చదువు ఆపేయకుండా తర్వాత తరగతిలోకి పంపి హైస్కూల్లో చేర్చాలి. అలాగే అంగన్‌వాడీలో చదువుకుంటున్న చిన్నారులను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వలంటీర్లు, హెచ్ఎంలు, టీచర్లు ఒకటో తరగతిలో చేర్చాలి.

నూరుశాతం ఉపాధ్యాయులు

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నూరు శాతం ఉపాధ్యాయుల భర్తీ జరిగింది. ఎక్కడా టీచర్ల కొరత అనే మాటే లేదు. ఇటీవల 870 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, 264 టీజీ సీలుగా పదోన్నతులు ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా 1,016 స్కూళ్లు ఉండగా, వాటిలోని 297 పాఠశాలల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. దానికి నేరుగా ఇంటర్నెట్ అనుసంధానించి విద్యా బోధన చేయనున్నారు. అలాగే 148 స్కూళ్లకు 387 టీవీలను పంపిణీ చేశారు. నాడు – నేడు ఫేజ్‌లో 674 పాఠశాలలు అన్ని సదుపాయాలు సమకూర్చుకున్నాయి. అలాగే లక్షా 21 వేల మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసేందుకు సిద్ధం చేశారు.



నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల



పిల్లలను బడికి పంపించాలని వారి తల్లులకు కౌన్సెలింగ్ ఇస్తున్న విద్యాశాఖాధికారులు

అడ్మిషన్లపై ప్రభావం చూపుతున్న అంశాలు

- గతంలో ప్రభుత్వ బడులంటే చిన్నచూపు ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిలో మార్పు తెచ్చింది. నాడు–నేడు కార్యక్రమం కింద స్కూళ్ల రూపురేఖలు మార్చేసింది. విద్యార్థులకు అన్ని వసతులనూ సమకూర్చింది. స్కూళ్లకు పక్కా భవనాలను సమకూర్చింది.
- అమ్మ ఒడి పథకం విద్యార్థుల చేరికపై ఏటా ప్రభావం చూపుతోంది. అటెండెన్స్ సైతం పెరుగుతోందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.
- స్కూళ్లు తెరిస్తే పాఠ్యపుస్తకాలు, బ్యాగులు లాంటివి కొనడానికి పిల్లల తల్లిదండ్రులు నానా అవస్థలు పడేవారు. ఇప్పుడు జగనన్న విద్యాకానుక కింద విద్యార్థికి అవసరమైనవన్నీ సమకూర్చుతున్నారు. స్కూళ్లు తెరిచేనాటికే వీటిని అందజేయడంలో విద్యాశాఖ విజయవంతమవుతోంది. దీంతో పిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.
- మధ్యాహ్న భోజన పథకాన్ని చక్కగా అమలు పర్చుతున్నారు. చక్కని మెనూతో కమ్మని భోజనం పెడుతున్నారు.
- సర్కారు బడుల్లో సమర్థులైన ఫ్యాకల్టీ ఉంది. దీంతో గడచిన మూడేళ్లుగా మంచి ఫలితాలు వస్తున్నాయి. ఇవి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తున్నాయి.
- ప్రైవేట్ స్కూళ్లకే పరిమితమైన ఇంగ్లిషు బోధన ప్రభుత్వ బడుల్లోనూ అమలు చేస్తున్నారు.

ప్రారంభం రోజు నుంచే పాఠాలు



సెలవుల్లోనే ప్రవేశాల పక్రియ పూర్తి చేశాం. స్కూలు తెరిచే రోజు నుంచే పాఠాలు ప్రారంభమవుతాయి. జిల్లా వ్యాప్తంగా బడి బయట ఉన్న పిల్లలను 105 మందిని గుర్తించాం. వారందరినీ పాఠశాలల్లో చేర్చుతున్నాం. నాడు – నేడు ఫేజ్ 2 పనులు దాదాపు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిజిటల్ తరగతుల బోధనకు టీవీలు, డిజిటల్ పరికరాలు అందజేశాం. జిల్లా వ్యాప్తంగా అన్ని స్కూళ్లల్లో ఉపాధ్యాయులను భర్తీ చేయడం, పదోన్నతులు ఇవ్వడం జరిగింది.

– ఎస్.అబ్రహం, జిల్లా విద్యాశాఖాధికారి, రాజమహేంద్రవరం

భూహక్కు పథకం
రక్షణ కవచం



డ్రోన్ సర్వేలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్షా పథకం భూయజమానులకు రక్షణ కవచంగా నిలుస్తోందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం వద్ద గురువారం నిర్వహించిన డ్రోన్ ఫ్లై ప్రక్రియను ఎంపీ మార్గాని భరత్ రామ్, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, నగరపాలకసంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సార్ ఐటీ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఈ డ్రోన్ ఫ్లై ప్రక్రియ పూర్తయిన తరువాత సంబంధిత ఏజెన్సీతో ఓఆర్ఐ మ్యాప్‌లను వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలతో గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వేలిడేషన్‌ను క్షేత్ర స్థాయిలో చేయించనున్నట్లు తెలిపారు. దానిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత మొబైల్ మేజిస్ట్రేట్ టీమ్‌తో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తదుపరి నోటిఫికేషన్ –13 జారీ చేసిన అనంతరం భూ హక్కు పత్రాలు అందజేస్తామన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలోని ఒకటి నుంచి ఆరు సర్వే వార్డులు, 154 బ్లాకులను రీసర్వే చేసేందుకు డ్రోన్ ఫ్లై ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగర పాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం నగర పాలక సంస్థ పరిధిలో రీసర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీఎం జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

మధురపూడి : కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. స్థానిక పీహెచ్‌సీ ఉద్యోగులు, వైద్యారోగ్య శాఖలోని కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న వారి సర్వీసు రెగ్యులరైజ్ చేయడంతో వీరంతా సంతోషాన్ని వ్యక్తం చేశారు., సీఎం జగన్‌కు, ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావును పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువాతో సత్కరించారు. సంఘం రాష్ట్ర నాయకులు యడ్ల రాజేష్, పీహెచ్‌సీ డాక్టర్ కోటేశ్వరరావు, విద్యాశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు జాకబ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా జగనన్న ఆణిముత్యాలు

- ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం
- 12 నుంచి 19 వరకూ కార్యక్రమం
- అధికారులకు కలెక్టర్ మాధవీలత ఆదేశాలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని స్కూల్, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయిలో వేడుకగా నిర్వహించాలని, అందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ మాధవీలత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జగనన్నకు చెబుదాం, జగనన్న విద్యాకానుక, స్త్రీ‌శిశు సంక్షేమం, ఆరోగ్యం, జీజీఎంపీ, స్పందన అంశాలపై గురువారం సాయంత్రం వెలగపూడి సీఎస్ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జేసీ ఎన్.తేజ్ భరత్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జగనన్న ఆణిముత్యాలు కింద జూన్ 12 నుంచి 19 వరకు స్కూల్ పరిధిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి సన్మానించాలన్నారు. స్కూల్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు, సర్టిఫికెట్, పతకం అందజేయాలన్నారు. 2023 మార్చిలో జరిగిన టెన్త్, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ మార్కులను సాధించిన ఇలా సన్మానిస్తామన్నారు. జూన్ 15న నియోజకవర్గంలో మండల స్థాయిలో కార్యక్రమం నిర్వహించి స్థానిక శాసన సభ్యుల ఆధ్వర్యంలో వేడుక నిర్వహించాలన్నారు. జిల్లా స్థాయిలో జూన్ 17న జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో జిల్లాలో పదో తరగతి, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఈసీలో ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థులకు వరసగా రూ.50 వేలు, రూ 30 వేలు, రూ.10 వేలు చొప్పున అందజేసి, సర్టిఫికెట్, మెడల్‌తో సన్మానిస్తామన్నారు. ఇందుకోసం స్కూల్ వారీగా విద్యార్థుల వివరాలు అందజేయాలన్నారు. జగనన్న విద్యాకానుకకు సంబంధించి జిల్లాలో 990 స్కూళ్ల పరిధిలో 1,21,800 కిట్లు పంపిణీకి సిద్ధమయ్యాయని, స్కూల్ బ్యాగులు రెండు రోజుల్లో చేరతాయన్నారు.

జగనన్నకు చెబుదాం/స్పందన

జిల్లాలో పంచాయతీరాజ్ శాఖలో తాగునీరు, సిల్ట్ తొలగింపుపై 115 ఫిర్యాదులు అందగా 89 తక్షణం పరిష్కారం చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. మునిసిపల్‌కు సంబంధించి తాగునీరు, సచివాలయ సందర్శనపై 22 అర్జీలకు గాను 18 పరిష్కారం చూపామన్నారు. విద్యుత్‌కు సంబంధించి 128 అర్జీలకు 94 వెంటనే పరిష్కరించామన్నారు.

వైద్య,ఆరోగ్య శాఖ

జిల్లాలో 338 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలకు గాను 293 రూఫ్ స్థాయి వరకు రాగా, వాటిలో 201 పూర్తయ్యాయని, 42 భవనాల పనులు పూర్తయ్యే దశలో ఉన్నట్లు తెలిపారు. నాడు – నేడు కింద మూడు పీహెచ్‌సీల్లో రెండు చోట్ల పనులు పూర్తి కాగా, కోటి కేశవరంలో చివరి దశలో ఉన్నాయన్నారు. జాతీయ హెల్త్ మిషన్ కింద ఖాళీగా 8 స్పెషలిస్ట్, 8 మెడికల్ ఆఫీసర్లు, 9 ఇతర పోస్టులు భర్తీకి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

ఏసీబీ వలలో రౌతులపూడి ఎంఈఓ

రౌతులపూడి: రౌతులపూడి మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఎస్.వెర్రి నాయుడు అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) వలలో చిక్కారు. రాజమహేంద్రవరం ఏసీబీ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బంగారయ్యపేట సమీపంలో స్వర్ణభారతి స్కూల్ రికగ్నేషన్, రెన్యువల్ ఫైల్ ప్రాసెస్ చేసేందుకు ఎంఈఓ ఎస్.వెర్రినాయుడును స్కూలు కరస్పాండెంట్‌ను కలిశారు. ఇందుకు ఆయన లంచం అడిగారు. ఈ విషయాన్ని కరస్పాండెంట్ అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబరుకు కాల్ చేసి చెప్పారు. ముందస్తు వ్యూహంలో భాగంగా ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం స్కూలు కరస్పాండెంట్ గిడజాం వద్ద రూ.7500 లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తర్వాత రౌతులపూడి ఎంఈఓ కార్యాలయంలో విచారించారు. రికార్డులను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ సౌజన్య వెల్లడించారు. పట్టుబడ్డ ఎంఈఓను రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు వివరించారు. ఈ ఏడాది ఇప్పటివరకు రాజమహేంద్రవరం గృహనిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్, మెడికల్ అండ్ హెల్త్ జూనియర్ అసిస్టెంట్, రాజమహేంద్రవరం జిల్లా వాణిజ్య పన్నులశాఖ (డీసీటీఓ)అధికారి, పిఠాపురం మున్సిపల్ ఏఈ, రౌతులపూడి ఎంఈఓ ఎస్.వెర్రినాయుడు ఏసీబీ దాడుల్లో పట్టుబడ్డారన్నారు. తాజా దాడుల్లో ఏసీబీ సీఐలు వి.పుల్లారావు, డి.వాసుకృష్ణ, బి.శ్రీనివాసరావు, వై.సతీష్ ఎస్.ఐ ఎస్.విల్సన్ బాబు ,ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లని కబురు కోసం నిరీక్షణ

- ఆలస్యమవుతున్న రుతు పవనాలు
- మరోపక్క రికార్డు స్థాయిలో ఎండలు
- జూన్ రెండో వారంలోనూ అదే తీవ్రత
- వర్షం కోసం మెట్టరైతు ఎదురుచూపు



కొవ్వూరులో ఆకాశంలో కమ్ముకున్న కారుమబ్బులు



కొవ్వూరులో ఎండ ప్రభావంతో నిర్మానుష్యంగా మారిన బస్టాండ్ సెంటర్

కొవ్వూరు: నైరుతి రుతు పవనాల రాక ఆలస్యమవుతోంది. జిల్లాలో మరోపక్క ఎండలు దంచి కొడుతున్నాయి. రుతు పవనాలు వస్తే తప్ప వాతావరణం చల్లబడే పరిస్థితి లేదు. ఈ నెలలో రెండో వారం ప్రవేశించినా వర్షం జాడ కనిపించలేదు. గత నెల మేలో సాధారణ వర్షపాతం కంటే 53.6 శాతం అధిక వర్ష పాతం నమోదైంది. 131.5 మి.మీటర్ల మేర వర్షం పడింది. ఈనెల 8వ తేదీ వరకు సరాసరి 18.4 మి.మీ. వర్షం కురవాల్సి ఉంది. కానీ 7.6 మి.మీ.మాత్రమే కురిసింది.

మండిపోతున్న ఎండలు

మరో ఐదు రోజులపాటు ఎండ తీవ్రత ఎక్కువగానే ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. రాజమహేంద్రవరంలో ఈనెల 7న రికార్డు స్థాయిలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని సగం మండలాల్లో 42 డిగ్రీల సరాసరి ఉష్ణోగ్రత నమోదువుతోంది. ఎండ వేడికి ఉక్కపోత తోడవటంతో జనం అల్లాడిపోతున్నారు. ఎండలు అధికంగా ఉండడంతో కొవ్వూరు మండలం చిడిపిలో ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గురువారం నుంచి మృగశిర కార్తె ప్రారంభమైంది. ఈ కార్తెలో సాధారణగా వాతావరణం చల్లబడుతుంది. అయినా భానుడు ప్రతాపం చూపుతూనే ఉన్నాడు.

మెట్ట ప్రాంతంలో నారుమళ్లపై ప్రభావం

కోరుకొండ, గోకవరంతో పాటు అనపర్తి మండలంలో నారు మళ్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు. బిక్కవోలు, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల తదితర మండలాల్లోని వర్షాధార ప్రాంతాల్లో ఖరీఫ్ నారుమళ్లపై ఎండల ప్రభావం కనిపిస్తుంది. నీటి వసతి లేని ప్రాంతాల్లో రైతులు ఈనెల మొదటి,రెండో వారంలో వర్షాలు పడిన తర్వాతే వ్యవసాయ పనులు ప్రారంభిస్తారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మెట్టలో ఆకుమళ్లు పోయడానికి కొంచెం సమయం పట్టే అవకాశం ఉంది. బోర్లు వసతి ఉన్న ప్రాంతాల్లో నారుమళ్లు పోస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3,729 హెక్టార్లలో నారుమళ్లు పోయాల్సి ఉండగా ఇప్పటివరకూ 566 హెక్టార్లలోనే ఈ ప్రక్రియ పూర్తయ్యింది.



కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో ఎండ తీవ్రతకు కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

పెరిగిన విద్యుత్ వాడకం

గడిచిన నాలుగు రోజుల నుంచి జిల్లాలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. రోజు వారీ కంటే సగటున 20 శాతం వినియోగం పెరిగింది. గతే ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మే 27న గరిష్టంగా 928 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉంది. ఈ ఏడాది ఈనెల 7న 1,089 మెగావాట్ల వినియోగించారు. రాజమహేంద్రవరం సిటీలో ఈనెల 1న 20.2 మిలియన్ యూనిట్లు వాడితే ఏడో తేదీ నాటికి 21.86 మిలియన్ యూనిట్లకి వినియోగం పెరిగింది. నిడదవోలు డివిజన్‌లో పరిధిలో 40 శాతం డిమాండ్ పెరిగింది. ఇరవై శాతం వినియోగం పెరిగింది. ఎండల తీవ్రత పెరుగుతుండడంతో వారం రోజుల నుంచి విద్యుత్ వినియోగం వేగంగా పెరుగుతోంది.

రాష్ట్ర స్థాయిలో తిరుమల హవా



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో విద్యాసంస్థల అధినేత తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో రాజమహేంద్రవరంలోని తమ తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమి విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ విభాగంలో ఫస్ట్‌ర్యాంకు, బైపీసీ విభాగంలో ఫస్ట్ ర్యాంకుతో పాటు టాప్‌టెన్‌లో తొమ్మిది ర్యాంకులను సాధించి అత్యుత్తమ ఫలితాలను అందించారని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమి చైర్మన్ నున్నతిరుమలరావు తెలిపారు. కె.సాయిసృజన స్టేట్ ఫస్ట్ ర్యాంకును, టి.సాహితి స్టేట్ ఫస్ట్ ర్యాంకును, వి.తేజశ్రీ స్టేట్ 3వ ర్యాంకును, డి.రూపిక స్టేట్ 4వ ర్యాంకును, కేవీ రామవినీష్ స్టేట్ 5వ ర్యాంకును, డి.కార్తీక్‌రామ్‌కిరీటి స్టేట్ 5వర్యాంకును, డిఎ.సాయిశ్రీకర్ స్టేట్ 6వ ర్యాంకును, యు.జితు కౌముది స్టేట్ 7వర్యాంకును, సీహెచ్ శ్రీచరణ్ స్టేట్ 8వ ర్యాంకును కైవసం చేసుకున్నారని ఆయన తెలిపారు. 10లోపు తొమ్మిదిమంది, 50లోపు 31మంది, 100లోపు 52మంది ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను నున్న తిరుమలరావు, డైరెక్టర్ సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్ బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

ఏపీఆర్‌జేసీలోనూ విజయకేతనం

• టాప్ ర్యాంకులు సాధించిన జిల్లా విద్యార్థులు • పదిలోపు ఎక్కువ ఇక్కడే

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు గత నెల 20వ తేదీన నిర్వహించిన పరీక్షా ఫలితాలలో తూర్పుగోదావరి జిల్లా విద్యార్థులు టాప్ లేపారు. ఎంపీసీ విభాగంలో బొమ్మూరుకు చెందిన కళాసాయి సృజన.. బైపీసీ విభాగంలో రాజమహేంద్రవరానికి చెందిన తానింకి సాహితి ప్రథమ ర్యాంకులను సాధించారు. రాజమహేంద్రవరం స్వరూప్‌నగర్‌కు చెందిన వనపర్తి తేజశ్రీ మూడవ ర్యాంకు(ఎంపీసీ), కాతేరుకు చెందిన దుద్దుపూడి రూపిక నాల్గవ ర్యాంకు(ఎంపీసీ), కోరుకొండ విద్యార్థి కప్పల వెంకట వినీష్ ఐదవ ర్యాంకు (ఎంపీసీ), రాజమహేంద్రవరానికి చెందిన దర్భా కార్తీకరామకిరీటి ఐదవర్యాంకు (బైపీసీ) సాధించారు. దువ్వి ఆశిష్ సాయిశ్రీకర్ ఆరవ ర్యాంకు, ఉద్రింకల జితు కౌముది ఏడవ ర్యాంకు, చవ్వాకుల శ్రీచరణ్ ఎనిమిదవ ర్యాంకు సాధించారు.



విద్యార్థి పేరు : కాలా సాయి సృజన
ఊరు : బొమ్మూరు
ర్యాంకు : ప్రథమ
తల్లిదండ్రులు : కాలా సుబ్బారావు (టీచర్), పద్మజ్యోతి (గృహిణి)
లక్ష్యం : ఐఐటీలో సీటు సాధించడం



విద్యార్థి పేరు : తానింకి సాహితి
ఊరు : రాజమహేంద్రవరం
ర్యాంకు : ప్రథమ
తల్లిదండ్రులు : తానింకి వెంకటరామరాజు (స్టాఫ్‌వేర్ ఇంజినీర్) నాగమణి (ప్రభుత్వ టీచర్)
లక్ష్యం : నీట్‌లో ర్యాంకు సాధించడం



విద్యార్థి పేరు : వనపర్తి తేజశ్రీ
ఊరు : రాజమహేంద్రవరం
ర్యాంకు : తృతీయ
తండ్రి : మల్లేశ్వరరావు (ప్రైవేట్‌జాబ్) లక్ష్మీ (గృహిణి)
లక్ష్యం : ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవడం



విద్యార్థి పేరు : దుద్దుపూడి రూపిక
ఊరు : కాతేరు
ర్యాంకు : నాలుగు
తండ్రి : గోవిందు (పేపరుమిల్లు ఉద్యోగి) పద్మావతి (గృహిణి)
లక్ష్యం : ఐఐటీ కంప్యూటర్ ఇంజినీరింగ్ చదవడం.



విద్యార్థి : కప్పల వెంకట రామవినీష్
ఊరు : కోరుకొండ
ర్యాంకు : ఐదు
తల్లిదండ్రులు : కృష్ణకుమార్, (మీసేవ, జిరాక్స్‌సెంటర్ నిర్వాహకుడు) ప్రవీణలక్ష్మి, (గృహిణి)
లక్ష్యం : ఐఐటీ సీటు సాధించడం.



విద్యార్థి: దర్భా కార్తీక్‌రామ్‌కిరీటి
ఊరు : రాజమహేంద్రవరం
ర్యాంకు : ఐదు
తల్లిదండ్రులు : డా.అరుణ్‌కుమార్ (ఈఎన్‌టీ స్పెషలిస్ట్), శ్రీలత (గృహిణి)
లక్ష్యం : నీట్‌లో ర్యాంకు

ఏసీ నుంచి మంటలు

రూ.3 లక్షల ఆస్తినష్టం



ఇంట్లో కాలిపోయిన మంచం, వస్తువులు

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడిలో ఒక ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని షేక్ అమ్మాజీ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఒక్కసారిగా ఏసీలోంచి పెద్దగా మంటలు వచ్చాయని ఇల్లంతా పొగ కమ్మేసిందని వేడి రావడంతో తాను లేచి చూసే సరికి మంటలు వ్యాపించడంతో తాను బయటకు వచ్చేశానని తెలిపారు. స్థానికులు కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. స్థానికులు గ్యాస్ సిలిండర్లు బయటకు తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఇనుప బీరువాలో ఉన్న విలువైన పత్రాలు, విలువైన సామాగ్రి, దుస్తులు, నగదు కాలిబూడిద అయ్యాయి. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వచ్చినట్టు తెలిపారు.

భక్తులతో రత్నగిరి కిటకిట

• సత్యదేవుని దర్శించిన 50 వేల మంది
• మూడు వేల వ్రతాల నిర్వహణ
• ఆదాయం రూ.50 లక్షలు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులు, నవ దంపతులతో రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలి వచ్చారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు భక్తులతో నిండిపోయాయి. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై 40 వివాహాలు జరిగాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో అదే ముహూర్తానికి పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో తమ బంధువులతో కలసి నవ దంపతులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు.

ఐదు వేల మందికి అన్న ప్రసాదం

గురువారం సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు మూడు వేలు జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.

గర్భాలయ ప్రదక్షిణ మార్గంలో ఏసీల ఏర్పాటు

సత్యదేవుని గర్భాలయ ప్రదక్షిణ చేసే భక్తుల సౌకర్యార్థం ఆలయం చుట్టూ ఏసీలు అమర్చారు. దీంతో ప్రదక్షిణ చేసే భక్తులకు ఉపశమనం లభించింది. ఇన్నాళ్లూ భక్తులు ఎక్కువ సేపు క్యూ లో నిలబడడంతో ఆలయంలో ఉక్కపోత భరించలేక ఇబ్బంది పడేవారు. ఏసీలు బిగించడంతో ఎక్కువ సమయం క్యూ లో నిలబడాల్సి వచ్చినా ఇబ్బంది లేకుండా ఉంది.



గురువారం వ్రత మంటపాల వద్ద భక్తుల రద్దీ

ట్రాక్టరును బైకు ఢీకొని ముగ్గురి మృతి

• జి.ముసలస్యపేట వద్ద ఘటన
• శోక సంద్రంలో శ్రీరాంపురం గ్రామం

తొండంగి: కాకినాడ జిల్లా తొండంగి మండలం జి.ముసలయ్యపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. తొండంగి ఎస్సై రవికుమార్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురానికి చెందిన పోలవరపు కిరణ్(23), పసుపులేటి దుర్గాప్రసాద్(20) కాకర వీరబాబు(21)స్నేహితులు. వీరు ముగ్గురూ కలిసి బుధవారం రాత్రి బైకుపై స్వగ్రామం నుంచి బీచ్‌రోడ్డు మీదుగా అన్నవరంలో జరిగే స్నేహితుని వివాహానికి బయలుదేరారు. వేమవరం, యర్రయ్యపేట మీదుగా ముగ్గురూ వస్తుండగా జి.ముసలయ్యపేట వద్ద వీరి బైకు ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో పోలవరపు కిరణ్, కాకర వీరబాబు సంఘటనా స్థలంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. దుర్గా శివప్రసాద్‌కు తీవ్రగాయాలై ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికులు తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాలను తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణ స్నేహాన్ని విడదీయలేకపోయిన మృత్యువు

పాయకరావుపేట (అనకాపల్లి జిల్లా): ముగ్గురు మిత్రుల మరణం పాయకరావుపేట మండలంలోని శ్రీరాంపురం గ్రామాన్ని శోక సంద్రంలో ముంచింది. ఒకరికి తల్లిదండ్రుల్లేరు. మరొకరికి తండ్రి లేడు. ఇంకొకరికి తండ్రి ఉన్నా.. అతని అండ లేదు. కష్ట సుఖాల్లో ఒకరికొకరు తోడై ఉండేవారు. కష్టపడి పనిచేసుకుంటూ తమ కుటుంబాలకు అండగా ఉన్నారు. వయసులో వారి మధ్య ఏడాది, రెండేళ్ల వ్యత్యాసమే. ఎక్కడికి వెళ్లినా ముగ్గురిదీ ఒకే మాట.. ఒకే వాహనం. అలాంటి మిత్రులను మృత్యువు కూడా ఒకేసారి కాటేసింది. వీరి ముగ్గురూ ఒకే గ్రామానికి చెందిన వారైనా.. కుటుంబ పరిస్థితి మాత్రం ఒక్కొక్కరిది ఒక్కోలా ఉంది.

• దుర్గాశివప్రసాద్‌కు తల్లిదండ్రుల్లేరు. చిన్నప్పటి నుంచి మేనత్త రమణమ్మ వద్దే ఉంటున్నాడు. రోడ్డు నిర్మాణానికి ఉపయోగించే మిల్లర్ పని చేస్తూ, ఆమెకు భరోసాగా ఉన్నాడు. ఇతని మరణంతో మేనత్త రమణమ్మ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.

• కిరణ్‌కుమార్‌కు తల్లి లక్ష్మి, సోదరి హరిణి ఉన్నారు. తండ్రి బతికే ఉన్నా.. ఆ కుటుంబానికి దూరంగా ఉంటున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. తల్లి స్థానికంగా ఉన్న జీడిపిక్కల ఫ్యాక్టరీలో కూలిపని చేస్తోంది. సోదరి దివ్యాంగురాలు కావడంతో ఆశలన్నీ కిరణ్ మీదే పెట్టుకున్నారు. కిరణ్ గ్రామంలో కూలి పనులతోపాటు, పెయింటింగ్ పనులకు వెళ్తుంటాడు. త్వరలోనే పెళ్లి చేసేందుకు సంబంధాలు కూడా చూస్తున్నారు. అలాంటి సమయంలోనే తమకు అందరాని దూరాలకు పోయిన కిరణ్‌ను తలచుకుంటూ ఆ తల్లి, కూతుళ్ల శోకం ఊరంతటినీ పట్టి కుదిపేస్తోంది.

• కాకర వీరబాబు మిల్లర్ పనితోపాటు, వ్యాన్ డ్రైవింగ్ చేస్తుంటాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. తండ్రి దారబాబు ఇంటి వద్దనే ఉంటాడు. తల్లి మేరీ గల్ఫ్‌లో ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. కొడుకు మరణవార్త తెలుసుకుని ఆ తల్లి అక్కడి నుంచి బయలుదేరినట్టు తెలిసింది.



కిరణ్‌కుమార్ మృతి చెందడంతో బోరున విలపిస్తున్న తల్లి లక్ష్మి



జి.ముసలయ్యపేట వద్ద ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైకు



మృతులు కిరణ్, శివ, వీరబాబు (ఫైల్)

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

రూ.11 లక్షల విలువైన 27 వాహనాలు స్వాధీనం

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాతో పాటు పశ్చిమగోదావరి జిల్లాలో 27 మోటారు వాహనాలను దొంగిలించిన వ్యక్తిని అరెస్ట్ చేసి అమలాపురం కోర్టులో హాజరు పరచినట్లు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మోటారు సైకిల్ దొంగ కేశవరపు సుబ్రహ్మణ్యం (సుబ్బు)ను నేరాలను వెల్లడించారు. పి.గన్నవరం మండలం వై.కొత్తపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం కాఫీ హోటల్‌లో పనిచేస్తుంటాడని, ప్రవృత్తిగా మోటారు సైకిళ్లను దొంగతనం చేస్తూ ఉంటాడన్నారు. అంబాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 4, పి.గన్నవరం 4, నగరం 1, రాజోలు 4, పాలకొల్లులో 1 మొత్తం 14 మోటారు సైకిళ్లు దొంగతనం చేసినట్టు గుర్తించామన్నారు. మరో 13 మోటారు సైకిళ్లను గుర్తించవలసి ఉందన్నారు. వీటి విలువ రూ.11 లక్షల వరకు ఉంటుందన్నారు. మాచవరం గ్యాస్ గోడౌన్ వద్ద అరెస్ట్ చేసి, అతను ఉంచిన మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్, స్థానిక ఎస్సై ఎ.చైతన్య కుమార్, సిబ్బంది హెచ్‌సీ బి.శ్రీనివాస్, కానిస్టేబుల్ డి.చిరంజీవికృష్ణ, కె.ఉమామహేశ్వరరావు, సీహెచ్ జగదీష్‌లను డీఎస్పీ అభినందించి, రివార్డుకు సిఫారసు చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ రమణ

వినియోగదారులకు నిరంతర విద్యుత్

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రోజుకు తలసరి 21 మిలియన్ యూనిట్ల అత్యధిక వినియోగం ఉన్నప్పటికీ వినియోగదారులకు ఏవిధమైన ఇబ్బందీ లేకుండా నిరంతరం విద్యుత్ పంపిణీ చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ టీవీఎస్ఎన్ మూర్తి గురువారం ప్రకటించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించని ఇబ్బందికర పరిస్థితులలో సాంకేతిక సమస్యలు వచ్చినప్పుడు మాత్రమే సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. కాకినాడ 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రధానంగా రెండు 220 కేవీ సర్క్యూట్‌ల ద్వారా పరవాడ నుంచి సరఫరా అవుతుందన్నారు. 7వ తేదీ బుధవారం సాయంత్రం 6:50 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పరవాడ నుంచి కాకినాడ వచ్చే 220 కేవీ రెండవ సర్క్యూట్ బ్రేక్‌డౌన్ కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ కారణంగా గ్రిడ్‌లో విద్యుత్ సరఫరా స్థిరీకరించేందుకు, 220 కేవీ పరవాడ కాకినాడ 1వ సర్క్యూట్‌పై ఓవర్ లోడ్ పడకుండా ఉండేందుకు విద్యుత్ సరఫరా నియంత్రించే కార్యక్రమం చేపట్టామన్నారు. దీనివల్ల కాకినాడ రెవెన్యూ డివిజన్‌లో కొన్ని ప్రాంతాలలో, అమలాపురం రెవెన్యూ డివిజన్‌లో కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు రొటేషన్ పద్ధతిలో లోడ్ రిలీఫ్ ఇచ్చామన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

అంబాజీపేట: నాలుగేళ్లుగా పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆపై మోసం చేసిన ఓ యువకుడిని పోక్సో కేసులో అరెస్ట్ చేసినట్లు కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ చెప్పారు. ఇందుకు సంబంధించి గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పి.గన్నవరం మండలం ముంగండ పాలెంకు చెందిన ఒక బాలికను రాజోలు మండలం ములికిపల్లికి చెందిన ముసునూరి వరప్రసాద్ ప్రేమ పేరుతో వంచించి, ఆమె పై పలుసార్లు అత్యాచారం చేశాడన్నారు. ప్రసాద్ పి.గన్నవరంలోని తన బంధువుల ఇంటికి వచ్చినప్పుడు ఆ బాలికతో నాలుగేళ్ల క్రితం పరిచయం ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ బాలికకు మాయ మాటలు చెబుతూ.. పెళ్లి మాట ఎత్తే సరికి మోహం చాటేశాడన్నారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో, అత్యాచారాల చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు డీఎస్పీ రమణ తెలిపారు. నిందితుడిని రాజోలు మండలం ములికిపల్లిలో అరెస్ట్ చేసి అమలాపురం కోర్టులో హాజరు పరచినట్లు చెప్పారు.

26 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులను అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, చిత్రంలో జెడ్పీ సీఈవో సత్యనారాయణ

ఉత్తర్వులు అందజేసిన జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పరిపాలనాధికారులు, విస్తరణాధికారులకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఆయా ఉద్యోగులకు ఎంపీడీవోలుగా ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాకు మొత్తం 26 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. వీరిలో 12 మంది పరిపాలనాధికారులు, 14 మంది విస్తరణాధికారులు ఉన్నట్లు జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు వివరించారు. పని తీరు ఆధారంగానూ, ప్రస్తుత మండలాలల్లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసేందుకు అనుభవం దృష్ట్యా మండల పరిషత్ అధికారులుగా నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నియామకాలు ఇలా..

ఐ.రత్నరాజు (కాజులూరు), ఎంవీఆర్ కుమార్ బాబు (ప్రత్తిపాడు), బి.చిన్నారావు (పిఠాపురం), పి.రవికుమార్ (తుని), బత్తిన అశోక్‌కుమార్ (పెద్దాపురం) జి. శివరామకృష్ణ (శంఖవరం), కె.నరేంద్రరెడ్డి (రాయవరం), ఎస్‌వీ చలం (కాట్రేనికోన), ఎంవీఎస్ నాయుడు (మలికిపురం), జగారావు రాంబాబు (ముమ్మిడివరం), ఎం.భారతి (పి.గన్నవరం), బీఎస్ఎస్ఎస్ కృష్ణమోహన్ (అల్లవరం), జి.నాగరాజకుమారి (ఉప్పలగుప్తం), జె.వెంకటేశ్వరరావు (అమలాపురం), కె.పద్మజ్యోతి (గోకవరం), కె.హిమ మహేశ్వరి (అనపర్తి), యు.కుమార్‌పట్నాయక్ (ఎటపాక), ఎల్. యాదగిరిశ్వరరావు (రాజవొమ్మంగి), డీఎస్ రత్నకుమారి (దేవీపట్నం), బి.హరికృష్ణ (రంపచోడవరం)